క్లుప్తంగా

పేస్ కాలేజీలో ఎన్‌సీసీ డే



ఎన్‌సీసీ డే వేడుకల్లో పాల్గొన్న క్యాడెట్లు

ఒంగోలు సెంట్రల్: పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ డేని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఆర్మీ ఫార్మేషన్స్‌తో శత్రువుల జాడ కనుగొని వారిని ఎదుర్కొనే విధానంపై కాలేజీలోని క్రీడా మైదానంలో విన్యాసాలు ప్రదర్శించారు. ప్రతి విద్యార్థి ప్రతిభ కనబరిచారు. కార్యక్రమానికి 34(ఏ) బీఎన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ సత్యనారాయణ హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, స్టూడెంట్ డీన్ ఆఫీసర్ డాక్టర్ వీరాంజనేయులు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమణబాబు, డిప్లమా ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, అసోసియేట్ నేషనల్ క్యాడెట్ కోర్స్ ఆఫీసర్ ఎల్డీ పృధ్వీ, కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విలువైన సామగ్రి పంపిణీ



టీషర్టులు, సిమెంటు బల్లలు అందజేస్తున్న చాపల కోటేశ్వరరావు

కొత్తపట్నం: మండలంలోని కె.పల్లెపాలెం గ్రామానికి రూ.2 లక్షల విలువ చేసే సామగ్రిని ఒంగోలులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు సహకారంతో సోమవారం బహూకరించారు. కొత్తపట్నం బీచ్‌లో పోలీస్ ఔట్ పోస్ట్, గ్రామంలో ముఖ్యమైన ప్రాంతాలు, తీరంలో సేద తీరేందుకు, బస్టాండ్ సెంటర్, ఆలయాలు, పాఠశాలల దగ్గర 40 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. మెరైన్ పోలీసులకు 35 టీషర్టులు అందజేశారు. దాతలు చాపల వంశీకృష్ణ, చాపల కోటేశ్వరరావుకు గ్రామస్తులు, భక్తులు, మెరైన్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

జండర్ మాసోత్సవాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎలిజబెత్‌రాణి

ఒంగోలు రూరల్: కేంద్ర, రాష్ట్ర మాసోత్సవాల ఆదేశానుసారం జండర్ మాసోత్సవాలను విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ ఏరియా కో–ఆర్డినేటర్ ఎం.విజయమ్మ కోరారు. ఒంగోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఒంగోలు ఏపీఎం గోపీనాథ్ అధ్యక్షతన వీఏవో, డ్వాక్రా, అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం సంయుక్త సమావేశం నిర్వహించారు. ఏరియా కో–ఆర్డినేటర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జండర్ అవగాహన కార్యక్రమాలను నవంబర్ 25 నుంచి డిసెంబరు 22వ తేదీ వరకు నిర్వహిస్తోందని తెలిపారు. ఆ మేరకు ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలను సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి సచివాలయ పరిధిలో నిర్వహించాలన్నారు. నాలుగు వారాలపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో వారానికి ఒక అంశంపై అవగాహన కల్పించాలన్నారు. మొదటి వారం లింగవివక్ష, రెండోవారం బాల్యవివాహాలు, మూడోవారం అనిమీయాపై అవగాహన, నాలుగోవారం డ్రాపవుట్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎలిజబెత్‌రాణి, ఆదిశేషు, ఒంగోలు ఏపీఎం గోపీనాథ్ మాట్లాడారు.

లింగ వివక్షను పారదోలాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, ఏపీఎం నరేంద్రకుమార్, వీఓఏలు, ఎంఎస్‌ఓబీలు

మద్దిపాడు: ప్రస్తుత సమాజంలో ఉన్న లింగ ఆధారిత వివక్షను పారదోలుదామని ఈఓపీఆర్‌డీ సుబ్బారావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో వీఓఏలు, ఎంఎస్‌ఓబీలతో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకూ నిర్వహించనున్న లింగ ఆధారిత హింస వ్యతిరేక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. వీఓఏలు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏపీఎం నరేంద్ర మాట్లాడుతూ ప్రతి వీఓఏ పరిధిలో కార్యక్రమాలు నిర్వహించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం మహిళలతో ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీసీలు మోహనరావు స్వర్ణలత, మూర్తి, ప్రేమానందం, వీఓఏలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.



ఒంగోలులోని ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



హరహర మహాదేవ...

- కార్తీక పౌర్ణమి సందర్భంగా మార్మోగిన శివనామస్మరణ
- భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

చీమకుర్తి: కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలన్నీ భక్తులతో పోటెత్తాయి. హరహర మహాదేవ శంభో శంకర.. ఓం నమఃశివాయ నినాదాలు మార్మోగాయి. ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని శివాలయాలన్నీ సోమవారం ఉదయం నుంచే భక్తులతో రద్దీగా మారాయి. ఆలయాల్లోని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి యోగివేమన రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెడ్ల సత్రం కమిటీ ఆధ్వర్యంలో సత్రం ప్రాంగణంలో కార్తీక వనభోజనాల కార్యక్రమంలో భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంతనూతలపాడులోని శివాలయంలో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని కార్తీక దీపారాధనలు చేశారు. సాయంత్రం ఆలయ కమిటీ నిర్వాహకులచే ఏర్పాటు చేసిన జ్వాలా తోరణాన్ని భక్తులు భారీగా పాల్గొని వీక్షించారు. ఒంగోలు నగరంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణాల్లో భారీగా కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సంతనూతలపాడు శివాలయంలో జ్వాలా తోరణంలో పాల్గొన్న భక్తులు



రామతీర్థంలోని రెడ్ల సత్రంలో వనభోజనాలు వడ్డిస్తున్న మారం వెంకారెడ్డి



సంతనూతలపాడు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపట్నం బీచ్‌లో పుణ్యస్నానాలు



కొత్తపట్నం తీరంలో సముద్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కొత్తపట్నం: కార్తీక పౌర్ణమి సందర్భంగా కొత్తపట్నం మండలంలోని కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల బీచ్‌లలో భక్తులు భారీ సంఖ్యలో సోమవారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పౌర్ణమి ఘడియలు ఉండటంతో సోమవారం వేకువజామున భక్తులు అధిక సంఖ్యలో సముద్రతీరానికి చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు పుణ్య స్నానాలకు వస్తూనే ఉన్నారు. కొత్తపట్నంలోని బస్టాండ్ సెంటర్ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు జనసంద్రంగా మారింది. రోడ్డంతా వాహనాలతో నిండిపోయింది. భక్తులు పోటెత్తడంతో బీచ్ మొత్తం ఇసుకేస్తే రాలనంతలా మారిపోయింది. భవానీ భక్తులు, శివ భక్తులు, అయ్యప్ప భక్తులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు అధిక సంఖ్యలో తీరానికి చేరుకుని సూర్యుడు ఉదయించకముందే పూజలు ప్రారంభించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా తీరం వద్దకు వాహనాలు వెళ్లడానికి పోలీసులు అనుమతించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపదల చేసి సముద్రస్నానం అనంతరం బృందావన్ రిసార్ట్స్ వైపున్న కొత్తపట్నం శివాలయం రోడ్డుకు వాహనాలను మళ్లించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండాపోయింది. భక్తులు తీరంలో ఇసుకతో శివలింగాలు చేసి చుట్టూ దీపాలు వెలిగించి టెంకాయలు కొట్టి పండ్లు, నిమ్మకాయలు, తమలపాకులు, పూలతో ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, అరటికాయలు, ధనం, చీర, జాకెట్లను ఆనవాయితీగా సముద్రంలో వదిలిపెట్టారు. సముద్రస్నానం చేసిన భక్తులు కొత్తపట్నం, ఈతముక్కల, మడనూరు, పాదర్తి శివాలయాల్లో పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై బి.సాంబశివరావు, మెరైన్ ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మైక్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రచారం చేశారు. గజఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. భక్తులకు మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్ నిర్వహించి వైద్య సౌకర్యం కల్పించారు. సివిల్, మెరైన్ పోలీసులు 40 మంది విధులు నిర్వహించి సముద్రస్నానాలను ప్రశాంత వాతావరణంలో ముగించారు.



సంతపేటలో శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న మఠంపల్లి దక్షిణామూర్తి

వైభవంగా శివపార్వతుల కళ్యాణం..

ఒంగోలు మెట్రో: కార్తీక పౌర్ణమి, సోమవారం కావడంతో నగరంలోని సంతపేట సాయిబాబా ఆలయంలో గల శివాలయంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు దీపారాధనలు చేశారు. బ్రహ్మశ్రీ మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో అంజలి గ్రానైట్స్ వారు దాతలుగా శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించి స్వామివారి ఆశీసులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కళ్యాణానికి భారీగా హాజరైన భక్తులు

శోభాయమానంగా పౌర్ణమి శ్రీగిరి ప్రదక్షిణ

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి శ్రీనివాసుని భక్త బృందం ఆధ్వర్యంలో ప్రతి నెలా పౌర్ణమి రోజు సాయంత్రం నిర్వహించే గిరి ప్రదక్షిణ సోమవారం సాయంత్రం భక్తుల గోవింద నామ స్మరణతో అత్యంత శోభాయమానంగా జరిగింది. బాపూజీ గో సంఘం వద్ద నుంచి జిల్లా గ్రంథాలయం, కేశవస్వామిపేట, శర్మ కాలేజీ రోడ్డు, గద్దలగుంట, కొణిజేడు బస్టాండ్ మీదుగా జరిగిన శ్రీగిరి ప్రదక్షిణలో స్థానిక భక్తులు పాల్గొని కొండ మీద స్కందగిరి చేరి వెంకటేశ్వరస్వామిని, గంగా పార్వతీ సమేత పరమేశ్వరుడిని, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఊరేగించారు. అఖండ దీపాలతో మంగళవాయిద్యాల నడుమ గోవిందనామాలు పఠిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు.



శ్రీగిరి ప్రదక్షిణలో ఉత్సవమూర్తులతో పాల్గొన్న అర్చకులు, భక్తులు

కాశీవిశ్వనాథునికి లక్ష బిల్వార్చన

ఒంగోలు మెట్రో: కార్తీకమాసంలో రెండో సోమవారం పౌర్ణమి కృత్తికా నక్షత్రం విశేషమైన రోజు కావడంతో స్థానిక మంగమూరుడొంకలోని శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో సహస్ర నామావళితో సామూహికంగా బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు, వేద పురోహితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన కాశీవిశ్వేశ్వరస్వామి



నగరోత్సవంలో కాశీవిశ్వనాథుడు

ఒంగోలు మెట్రో: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు విశేషంగా కార్తీకదీపాలు వెలిగించారు. రాత్రివేళ ఒంగోలు నగర వీధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి నగరోత్సవాన్ని ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాదశాస్త్రి, శంకరమంచి రామకృష్ణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణ అధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యుడు కుర్రా ప్రసాద్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టోత్తర శతసహస్ర కలశాభిషేకం



శంఖచక్రాలుగా భక్తులు వెలిగించిన కార్తీకదీపాలు

ఒంగోలు మెట్రో: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు, వేద పండితులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో కుంభ పూజ, హోమం, పూర్ణాహుతి, అష్టోత్తర శతసహస్ర కలశాభిషేకం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని పూజలు చేశారు. భక్తులు శ్రీవారికి సమర్పించిన వక్ష స్థల లక్ష్మీ అమ్మవారి స్వర్ణ ప్రతిమ కార్యక్రమంలో శ్రీగిరి ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు. శ్రీనివాసరావు దంపతులు శ్రీవారికి మేల్చాట్ వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్తీక దీప కాంతులతో శ్రీగిరి ఆలయం శోభిల్లింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ఆలూరు లక్ష్మీకుమారి, ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఒంగోలు సెంట్రల్: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక పీవీఆర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ తారక్‌నాథ్, డీబీఆర్‌సీ సిటీ కో ఆర్డినేటర్ గుత్తి కోటేశ్వరరావు, లెక్చరర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా కోశాధికారిగా కుంచాల

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కోశాధికారిగా కుంచాల వెంకట శివను ఆ విభాగపు రాష్ట్ర అధ్యక్షుడు రంగుల గోపీశ్రీనివాస్ నియమించారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఆ విభాగపు జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్‌కు గోపీశ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధి కూలీలకు పనులు గుర్తించాలి

అల్లూరు (కొత్తపట్నం): ఉపాధి కూలీలకు పనులు గుర్తించాలని ఒంగోలు క్లస్టర్ ఏపీడీ పాలేటి వెంకటస్వామి సిబ్బందికి సూచించారు. అల్లూరు గ్రామంలో రాజీవ కళామందిర్‌లో సోమవారం సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు పనులు కల్పించడానికి పీఆర్‌ఏ ప్లానింగ్ ద్వారా రెండో గ్రామ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీజనల్, రిసోర్స్, సోషల్ మూడు రకాల మ్యాప్‌లు వేసి కూలీలకు అవగాహన కల్పించామన్నారు. అల్లూరు గ్రామానికి రూ.1.74 కోట్ల విలువైన పనులు గుర్తించాలన్నారు. అల్లూరు గ్రామ కూలీలకు 46 వేల పని దినాలు కల్పించడం జరుగుతుందన్నారు. పంచాయతీ తీర్మానాలైన తర్వాత మండల సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఇవన్నీ అయిన తర్వాత పనులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఏపీవో రత్నజ్యోత్స్న, జేఈ చంద్రశేఖర్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న వెంకటస్వామి

మొక్కలకు సూక్ష్మపోషకాలు అందించాలి

ఈతముక్కల (కొత్తపట్నం): వెసిక్యులర్ ఆర్బస్కులర్ మైకోరిజా అనే శిలీంధ్రాన్ని భూమిలో తప్పనిసరిగా వాడుకుని మొక్కలకు అన్నిరకాల సూక్ష్మ పోషకాలు అందించాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి రైతులకు సూచించారు. ఆయనతో పాటు వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం పొలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వెసిక్యులర్ ఆర్బస్కులర్ మైకోరిజా అనే శిలీంధ్రాన్ని భూమిలో చల్లడం వలన భూమిలో వృథాగా పడి ఉన్న భాస్వరం, ఇతర సూక్ష్మపోషకాలను కరిగించి మొక్కలకు అందుబాటులో ఉంచుతుందన్నారు. ఇది మొక్క వేరు వ్యవస్థలో ఒక భాగమై మొక్కకు అన్ని రకాల సూక్ష్మపోషకాలతో పాటు స్థూల పోషకాలను కూడా అందిస్తుందన్నారు. దీన్ని అమరావతి పరిశోధనా కేంద్రం నుంచి శాస్త్రవేత్తల సలహా మేరకు తెప్పించినట్లు తెలిపారు. ముందుగా పిట్టు వెంకటేశ్వరరెడ్డి పొలంలో వేస్తున్నామని, దాని ఫలితాలు చూసి అందరికీ పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ అనిల్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



రైతు వెంకటేశ్వరరెడ్డి పొలంలో వెసిక్యులర్ ఆర్బస్కులర్ మైకోరిజా శిలీంధ్రాన్ని వేస్తున్న రవీంద్రరెడ్డి

రాయితీ రుణాలు వినియోగించుకోవాలి

- వైఎస్సార్ కేపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్

తాళ్లూరు (ముండ్లమూరు): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ కేపీ ప్రాజెక్టు డైరెక్టర్ టి.రవికుమార్ అన్నారు. మండలంలోని మన్నేపల్లి పంచాయతీ పరిధి దారంవారిపాలెం గ్రామానికి చెందిన గోగుల జయమ్మ 13 లక్షల 84 వేలతో నూతనంగా ఏర్పాటు చేసిన బేకరి యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి పథకం వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశక్తి మహిళలను ప్రోత్సహించేందుకు బ్యాంకులు తమ సహాయ సహకారాలు అందజేస్తున్నాయని తెలిపారు. మూడు లక్షల ఉన్నతి పథకం, పది లక్షల 80 వేలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా తూర్పుగంగవరం బ్రాంచి వారు రుణం మంజూరు చేయగా 35 శాతం రాయితీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పీఎంఎఫ్ ఎంఈ పథకం ద్వారా వ్యాపారంపై ఆశక్తి ప్రతి ఒక్కరికీ రెండు లక్షల పైన పెట్టుబడి పొందిన వారికి 35 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఎలాంటి వ్యాపారాలు చేసుకోవాలన్నా అన్ని వర్గాల వారికి ఈ అవకాశం ఉందని చెప్పారు. నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. మీతో పాటు మరి కొంత మందికి ఇలాంటి యూనిట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వైఎస్సార్ కేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు డేవిడ్, శ్రీనివాసప్రసాద్, సుబ్బారావు, దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, ఏపీఎం దేవరాజ్, సీసీలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సూచనలిస్తున్న పీడీ రవికుమార్

బాలికల వసతి గృహాన్ని మార్చాలి

ఒంగోలు టౌన్: శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడుతున్న సంతపేటలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని నూతన భవనంలోకి మార్చాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ డీడీలకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం బాలికలు ఉంటున్న వసతి గృహం గోడలు బాగా దెబ్బతిన్నాయని, వర్షానికి కారుతోందని తెలిపారు. విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అంజయ్య రోడ్డులోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని కూల్చి చదును చేయాలని వినతిపత్రంలో కోరారు. ఆ ప్రాంతంలో పాములు, తేళ్లు తిరుగుతున్నాయని, విద్యార్థులు భయంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్ స్పందిస్తూ త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

సంతనూతలపాడులో రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు

చీమకుర్తి: కలెక్టర్ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో రెడ్‌క్రాస్ సొసైటీని ఏర్పాటు చేస్తున్నట్లు సంతనూతలపాడు తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీకి జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో తహసీల్దార్ అధ్యక్షులుగా కొనసాగుతారన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న రెడ్‌క్రాస్ సొసైటీకి చైర్మన్, వైస్ చైర్మన్లను ఈ నెల 17న మొదటి సమావేశంలో ఎన్నుకుంటారని చెప్పారు. సొసైటీలో జీవితకాల సభ్యులుగా చేరేవారంతా ఈ నెల 17న సంతనూతలపాడులోని సేవాసంకల్ప చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని సూచించారు.